యాంత్రీకరణ వైపు అడుగులు

- రైతులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- రైతు భరోసా కేంద్రాల ద్వారా పరికరాల అందజేత



గంగలకుర్రులో పవర్ టిల్లర్లను రైతులకు అందిస్తున్న అధికారులు

అంబాజీపేట: వ్యవసాయం దండగా కాదు పండగ అని ప్రభుత్వం నిరూపించింది. అనేక పథకాలు అమలు చేసి రైతులను ఆదుకుంటోంది. ప్రధానంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అండగా నిలబడుతోంది. రైతులకు కావాల్సిన సాయం, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరా, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు, యంత్రాలు అందిస్తోంది. ఈ క్రమంలోనే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందేలా ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేస్తోంది. రైతులకు యంత్ర పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. రాబోయే రోజుల్లో డ్రోన్లు రైతులు నేరుగా పొందే అవకాశం ఉంది. డ్రోన్ల వినియోగంపై అధికారులు శిక్షణ ఇస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతుకు తోడ్పాటునందిస్తూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రభుత్వం తీసుకొస్తోంది. రైతులను సంఘటితం చేసి తమకు అవసరమైన యంత్ర పరికరాలు వారే ఎంచుకొనే విధంగా ప్రభుత్వం చైతన్య పరుస్తోంది. ఎంపిక చేసుకున్న పరికరాలను సబ్సిడీపై అందిస్తోంది.

కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా సేవలు

జగనన్న ప్రభుత్వం ప్రతి రైతు భరోసా కేంద్రంలో కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేసింది. సాగు చేసే రైతుల అవసరాలను గుర్తించి వాటినే రైతులకు అందజేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీని ద్వారా అన్ని రకాల పనిముట్లతో పాటు, కలుపుతీసే యంత్రాలు, పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్‌లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. కొత్తపేటలో 26 ఆర్బీకేలకు 17, రావులపాలెంలో 23 ఆర్బీకేలకు 14, ఆలమూరులో 24 ఆర్బీకేలకు 18, ఆత్రేయపురంలో 26 ఆర్బీకేలకు 12 కేంద్రాలకు పరికరాలు అందజేశారు. రాజోలులో 20 ఆర్బీకేలకు 19, మల్కిపురంలో 22 ఆర్బీకేలకు 20, సఖినేటిపల్లిలో 20 ఆర్బీకేలకు 18, అంబాజీపేటలో 19 ఆర్బీకేలకు 19, పి.గన్నవరంలో 23 ఆర్బీకేలకు 22 కేంద్రాలకు అందించారు. మామిడికుదురులో 22 ఆర్బీకేలకు 19, అయినవిల్లిలో 22 ఆర్బీకేలకు 19 కేంద్రాలకు ప్రభుత్వం కోట్లాది రూపాయల విలువ చేసే పరికరాలు అందజేశారు. ట్రాక్టర్లు, పవర్ ట్రిల్లర్లు, రోటేవేటర్లు, వరి కోత యంత్రాలు, గడ్డి చుట్టే యంత్రాలు, తైవాన్ స్ప్రేయర్లను రైతులకు అందించారు. ఆ యంత్రాల సాయంతో రైతులు తక్కువ ఖర్చుతో సాగు పనులు చేస్తున్నారు.

యంత్ర పరికరాలపై సబ్సిడీ

ట్రాక్టర్ రూ.7.72 లక్షలకు గాను సబ్సిడీ రూ.2.90 లక్షలు, బ్యాంకు రుణం రూ.3.86 లక్షలు, రైతు వాటా రూ. 91,500 చెల్లించాలి. పవర్ ట్రిల్లరు రూ.1.86 లక్షలు గాను సబ్సిడీ రూ.70 వేలు, బ్యాంకు రుణం రూ.93 వేలు, రైతు వాటా రూ.23 వేలు, వరి కోత యంత్రం రూ.28 లక్షలు, సబ్సిడీ రూ.8.80లక్షలు, బ్యాంకు రుణం రూ.14లక్షలు, రైతు వాటా 5.20లక్షలు చెల్లించాలి. ఇప్పటి వరకూ 181 యంత్రాలన రైతులకు అందజేశారు.

యంత్రాల కోసం దరఖాస్తు



ఆధునిక వ్యవసాయంలో భాగంగా శాస్త్రవేత్తల సూచనలు సలహాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించడంతో పాటు, కస్టమ్ హైరింగ్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కూలీల కొరతను నివారించేందుకు యంత్రాల వినియోగం అవసరం. రైతులకు అవసరమైన యంత్ర పరికరాలు ఇప్పటికే ఆయా గ్రూపులకు అందజేశాం. మరింత మంది వీటిని పొందేందుకు వీలుగా ఐదుగురు చొప్పున సభ్యులు గ్రూపులుగా ఏర్పడి దరఖాస్తు చేసుకుంటే వెంటనే సబ్సిడీ పై యంత్రాలు అందిస్తాం.

– ఎస్‌జేవీ రామమోహనరావు, ఏడీఏ, పి.గన్నవరం

యంత్రాల సాగు లాభదాయకం



రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న యంత్రాలతో సాగు వల్ల తక్కువ ఖర్చుతో లాభాలు పొందుతున్నాం. రైతులను సంఘటితం చేసి అవసరమైన యంత్రాలను 40 శాతం సబ్సిడీ ద్వారా అందిస్తున్నారు. 50 శాతం బ్యాంకు నుంచి రుణం ఇవ్వగా 10 శాతం రైతులు చెల్లించుకుంటున్నాం. గ్రామాల్లో ఆర్బీకేలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు మెరుగైన సమాచారంతో పాటు రాయితీలతో కూడిన పథకాలు అందుతున్నాయి.

– బొంతు శ్రీనివాస్, రైతు, ఇసుకపూడి

క్లుప్తంగా

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజ స్తంభ శిఖరాన్ని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: గోగన్నమఠంలో పార్వతీ సోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవోపేతంగా జరిగింది. వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. దీనిలో భాగంగా సాగి కేశవమూర్తిరాజు, సునీత, సూర్యనారాయణ రాజు, వెంకటలక్ష్మి, కల్యాణ్ వర్మ, దీప్తి దంపతులు కర్తలుగా పాల్గొని పలు పూజలు చేశారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాల్లో బుధవారం అన్న సమారాధనతో ముగియనున్నట్టు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సాగి సూరిబాబురాజు తెలిపారు.

ఘనంగా అమ్మవారి ప్రభ ఊరేగింపు

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువై ఉన్న పెద్దింట్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి ప్రభ ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ట్రాక్టర్‌పై కొలువుదీర్చిన అమ్మవారి ప్రభ ఊరేగింపు ఆలయం వద్ద నుంచి ప్రారంభించారు. ప్రధాన వీధుల్లో సాగిన ఊరేగింపులో భక్తులు అమ్మవారికి నైవేద్యాలుగా సమర్పించుకున్నారు. రాత్రి ఆలయంలో గోకర్ణేశ్వర స్వామి, జలదుర్గ అమ్మవారి కల్యాణం మెండు ఉదయభాస్కరరావు, అన్నపూర్ణ దంపతులు ఘనంగా నిర్వహించారు.

ఈకేవైసీ చేస్తేనే పథకాలు

అంబాజీపేట: రానున్న రోజుల్లో ప్రతి రైతు, కౌలు రైతుల ఆధార్ కార్డు ఈకేవైసీ చేయించుకుంటేనే పీఎం కిసాన్ ఆర్థిక సాయం బ్యాంకు ఖాతాల్లో జమవుతుందన్న విషయాన్ని రైతులకు వివరించాలని పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు సూచించారు. అంబాజీపేట మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన వీఏఏలు, వీహెచ్ఏలతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ అంబాజీపేటలో 1779, పి.గన్నవరంలో 2190, మామిడికుదురులో 1092 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవల్సి ఉందన్నారు.

బాధితులకు చేయూత

రావులపాలెం: కుటుంబ పెద్దను కోల్పోయి జీవనాధారం లేక ఇబ్బంది పడుతున్న పలువురికి తమ సంస్థ నుంచి సాయం అందించినట్టు స్థానిక సత్యసాద ఫౌండేషన్ సభ్యులు బుధవారం తెలిపారు. దేవరపల్లి గ్రామానికి చెందిన మామిడిశెట్టి వీరవెంకట సూర్యనారాయణ ఇటీవల గుండెపోటుతో మరణించడంతో ఆ కుటుంబానికి పోషణ నిమిత్తం రూ.5 వేలు చెక్కును అందజేశామన్నారు. రావులపాడు గ్రామానికి చెందిన చింపల్లి సత్యగౌరీ కుటుంబానికి, రావులపాలెం కొత్త కాలనీకి చెందిన ఆకుల పోశియ్య కుటుంబ సభ్యులకు నెలవారీ కిట్లు 21 రకాల నిత్యావసరాలు అందించామన్నారు.

ఆసుపత్రిలో పింఛను అందజేత



దేవశ్యామలకు పింఛను అందిస్తున్న దృశ్యం

మలికిపురం: మలికిపురానికి చెందిన దేవశ్యామలకు ప్రతి నెలా ఇస్తున్న పింఛన్‌ను బుధవారం లక్కవరం ఆసుపత్రిలో అందించారు. శ్యామల అనారోగ్యంతో లక్కవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. గ్రామానికి చెందిన సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, నాయకులు గెడ్డం తులసీ భాస్కరరావు, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కోళ్ల వేణుప్రసాద్, కార్యదర్శి తాడి వర్మ, వలంటీరు గేదెల రాజేంద్ర తదితరులు ఆసుపత్రికి వెళ్లి పింఛను అందించారు.

దాళ్వాకు సాగునీరు అందించాలని వినతి

మామిడికుదురు: దాళ్వా పంటకు వంతుల వారీగా సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరుతూ మండల సర్పంచ్‌ల సమాఖ్య బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందించింది. సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు ఆధ్వర్యంలో సర్పంచులు ఈ వినతిపత్రం అందించారు. మండల పరిధిలో శివారు ప్రాంతాలకు సక్రమంగా సాగునీరు అందడం లేదన్నారు. దీనివల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని, సమస్య పరిష్కరించాలని కోరారు. సర్పంచ్‌లు మొహిద్దీన్, శ్రీనివాస్, రాజేష్‌కుమార్, రామశివసుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ నాగరాజు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోను రాణించాలి

మామిడికుదురు: విద్యతో పాటు అన్ని రంగాల్లోను విద్యార్థులు రాణించాలని ఎంఈఓ కోన హెలీనా పేర్కొన్నారు. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల స్థాయిలో ఏర్పాటు చేసిన వివిధ పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులు అందించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎస్ఆర్ఐ నయినాల శ్రీనివాస్ అందించిన రూ.25 వేలు నగదు ప్రోత్సాహాన్ని ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎంఈఓతో పాటు దాత తండ్రి నయినాల తమ్మారావు అందజేశారు.

భూ సర్వేను పక్కాగా నిర్వహించాలి

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- గెద్దాడలో సర్వే పరిశీలన



గెద్దాడలో జరుగుతున్న భూ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ శుక్లా

మామిడికుదురు: జగనన్న శాశ్వత సమగ్ర భూ సర్వేను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. గెద్దాడ గ్రామంలో జరుగుతున్న సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్లా రెవెన్యూ అధికారులతో సర్వే జరుగుతున్న తీరుపై చర్చించారు. సర్వేపై రైతులకు ముందుగా సమాచారం అందించాలన్నారు. వారికి నోటీసులు జారీ చేసిన అనంతరం సర్వే చేయాలని ఆదేశించారు. రైతుల సమక్షంలో సర్వే చేయాలని, వారి నుంచి ఏ విధమైన ఫిర్యాదులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గెద్దాడలో 542 ఎకరాలు భూమి ఉందని తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ తెలిపారు. ఈ గ్రామంలో డిసెంబర్ 13వ తేదీన సర్వే ప్రారంభించామన్నారు. అనంతరం కలెక్టర్ పంట పొలాల్లో పర్యటించి సర్వే జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. ఆయన వెంట డివిజనల్ సర్వేయర్ యామిని, డిప్యూటీ తహసీల్దార్ శరణ్య, మండల సర్వేయర్ ఎండీ ఖాన్, వీఆర్వో కడలి వెంకటేశ్వరరావు, స్థానిక సర్పంచ్ గుబ్బల గీతాభవాణి, ఉప సర్పంచ్ నేదూరి రాంబాబు, రైతులు బొక్కా శివన్నారాయణ, గుబ్బల పెద్దిరాజు, బొక్కా శ్రీరామమూర్తి, గూటం వెంకన్న తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలి

రాజోలు: నవరత్నాలు పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో చేపడుతున్న గృహ నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ కలెక్టర్ హిమాన్షు శుక్లా గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం రాజోలులోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను పరిశీలించారు. గృహ నిర్మాణ సంస్థ పీడీ ఎం.బాబూరావు, తహసీల్దారు బి.ఎం.ముక్తేశ్వరరావు, సర్పంచ్ రేవు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన నాయకులు



నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు కుమార్తె సౌమ్యశ్రీ, వెంకటశివతేజల వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యేందుకు బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు పట్టణ శివారులోని



సుబ్బరాజుపేటలో హెలిప్యాడ్ వద్ద దిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యేలు కొండేటి చిట్టిబాబు, చిర్ల జగ్గిరెడ్డి కలుసుకున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



జ్యోతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: మగటపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు యాలంగి జ్యోతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ నేపథ్యంలో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుతో పాటు పార్టీ నాయకులు బుధవారం జ్యోతి కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె చిత్రపటం వద్ద ఎమ్మెల్యే శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, పార్టీ ఐటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి సూరిశెట్టి బాబి, వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్ ఎండీవై షరీఫ్, ఉప సర్పంచ్ మట్టా గంగయ్య, పార్టీ నేతలు కలిగితి రామకృష్ణ, బొడ్డపల్లి సాయిబాబు, భూపతి గంగాధరమ్ ఉన్నారు.

సరిహద్దుల్లో రాళ్లు ఏర్పాటు



గుమ్మిలేరులో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ ముక్కంటి

ఆలమూరు: భూ సర్వే పూర్తవడంతో గుమ్మిలేరు పక్కన ఉన్న మోదుకూరు, పెదపళ్ల గ్రామాలకు సంబంధించిన సరిహద్దు రాళ్లు ఏర్పాటు ప్రక్రియను కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి బుధవారం ప్రారంభించారు. ఇప్పటికే గుమ్మిలేరులో భూసర్వే పూర్తి కావడంతో అధికారులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఈ రాళ్లను కూలీల సాయంతో ఏర్పాటు చేశారు. అనంతరం మడికిలో సరిహద్దు రాళ్లు వేశారు. రైతుల కలిగే ప్రయోజనాలపై సర్పంచ్ యు.లక్ష్మీ మౌనిక అధ్యక్షతన అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. సర్పంచ్ గుణ్ణం రాంబాబు, పెంటపాటి శ్యామల, ఏడిద సత్యశ్రీ, కార్యదర్శులు కె.మోక్షాంజలి, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

కొత్తపేట: భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వ ఆదుకోవాలని జిల్లా చేతి వృత్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి కోరారు. బుధవారం స్థానికంగా జరిగిన వడ్రంగి మేస్త్రీల సంఘ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కరోనా కాలం నుంచి భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం కార్మికులను ఆదుకోవాలని కోరారు. తపాలా శాఖ ప్రవేశపెట్టిన ప్రమాద బీమా రూ.399తో రూ.10 లక్షలు వర్తించే పాలసీని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా సంక్షేమ సంఘంలో చేరిన వారికి ప్రమాద బీమా కింద రూ.25 వేలు రాష్ట్ర సంఘం ఇస్తుందన్నారు. అందువలన కార్మికులు అందరూ జిల్లా సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. మండల సంఘం అధ్యక్షుడు పులిదిండి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, జిల్లా, మండల సంఘాల సభ్యులు రాయుడు రాజు, బొక్కా రామకృష్ణ, రొక్కాల శ్రీనివాసరావు, పాలమూరు రామకృష్ణ, పాటి వెంకట్రామయ్య, మాకే ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఇద్దరి ఎంపిక



బి.రోహిత్‌సాయికృష్ణ



సీహెచ్ లక్ష్మిసాయిశ్రీ

రావులపాలెం: ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్టు ఈతకోట హైస్కూల్ హెచ్ఎం కేఎస్‌వీ కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. గత నెల పదో తేదీ నుంచి 12 తేదీ వరకూ విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ పాఠశాల నుంచి పదో తరగతి విద్యార్థి బి.రోహిత్ సాయికృష్ణ, తొమ్మిదో తరగతి విద్యార్థి సీహెచ్ లక్ష్మీసాయిశ్రీ పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల మూడో తేదీ నుంచి ఐదో తేదీ వరకూ గుంటూరులో జరిగే జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు.

కోళ్ల పెంపకంతో ఆర్థిక స్వావలంబన

ఆలమూరు: డ్వాక్రా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వీలుగా ప్రభుత్వం అమలు చేస్తున్న పెరటి కోళ్ల పెంపకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏపీఎం ఎం.ధనరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పెరటి కోళ్ల పెంపకందారుల లబ్ధిదారులకు ప్రోత్సాహకాల కార్యక్రమంలో సర్పంచ్ తమ్మన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అర్హులైన 15 మందికి ఒక్కొక్కరికి రూ.3500 చొప్పున మొత్తం రూ.52,500 వేలు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం సర్పంచ్ తమ్మన అధ్యక్షతన స్థానిక శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో డ్వాక్రా మహిళల సదస్సు జరిగింది.

నేడు గృహసారథులకు సదస్సు


పి.గన్నవరం: ఈనెల 18వ తేదీ నుంచి జరుగనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై మండలంలోని వై.కొత్తపల్లి, ఆర్.ఏనుగుపల్లి, పి.గన్నవరం గ్రామాల్లో గురువారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు.

వ్యక్తిపై కేసు

అయినవిల్లి: గ్రామంలో ఓ కోళ్లఫారానికి నిప్పు అంటించిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తొత్తరమూడికి చెందిన బద్రి శ్రీనివాసరావు అయినవిల్లికి చెందిన జి.దీలీప్ కుమార్ తండ్రి వద్ద కోళ్లఫారం లీజ్‌కు తీసుకున్నాడు. వారం రోజుల కితం లీజ్ గడువు పూర్తి కాకుండానే కోళ్లఫారంను ఖాళీ చేయాలని దీలీప్‌కుమార్ బద్రి శ్రీనివాసరావుతో వివాదానికి దిగాడు. ఖాళీ చేయకపోతే కోళ్లఫారానికి నిప్పు అటింస్తానని బెదిరించాడు. అన్నట్టుగానే సోమవారం నిప్పంటించాడని బద్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు తెలిపారు.

కన్నుల పండువగా చక్రస్నానం

ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్వామివారి చక్రస్నానంలో పాల్గొన్న పాతపాటి కుటుంబ సభ్యులు

ఆత్రేయపురం: స్థానిక శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలు పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారి చక్రస్నానం కన్నుల పండువగా జరిగింది.. లొల్ల లాకుల వద్ద నదీ తీరంలో చక్రతీర్థ స్నానం దీక్షావిసర్జన, ధ్వజావారోహణం తదితర పూజా కార్యక్రమాలను శ్రీమాన్ ఖండవిల్లి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు నిర్వహించారు. కార్యక్రమాలను పాతపాటి బ్రదర్స్ పాతపాటి నాగరాజు, రామాంజనేయరాజు, రమణరాజు ఆధ్వర్యంలో ఘనంగా చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనందరరావు స్వామి వారిని దర్శించుకున్నారు. వెంకట సత్యరాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ఆలయ చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణరాజు (రమణరాజు), పాతపాటి రామాంజనేయరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది గోరింట వినయ్ కుమార్‌రాజు, పాకలపాటి వెంకట్రాజు, ఆలయ అర్చకులు భక్తులకు ఏర్పాట్లు నిర్వహించారు.

రావులపాలెం: అలివేలు మంగా పద్మావతి ఆండాల్ సహిత వేంకటేశ్వరస్వామి 14వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం స్వామి వారికి సరస్వతి హోమం తదితర పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. రాత్రికి స్వామివారికి ముత్యాల పందిరి వాహనోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండుగా నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థాన పాలక మండలి చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి తదితర సభ్యులు పర్యవేక్షించారు.

కొబ్బరి సంకరీకరణపై శిక్షణ



అంబాజీపేటలో కొబ్బరిపై శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

అంబాజీపేట: కొబ్బరి సంకరీకరణలో భాగంగా కొబ్బరి చెట్లపై ఉండే ఆడ పుష్పాలపై పుప్పొడిని గాలి పీడనం ద్వారా వెదజల్లాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్ర అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు అన్నారు. అంబాజీపేట డాక్టర్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో కొబ్బరి సంకరీకరణపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమం మూడో రోజు బుధవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కొబ్బరి సంకరీకరణలో పొత్తుల నుంచి మొగ పుష్పాలను వేరు చేయడం, బ్యాగింగ్, పరాగ సంపర్కం, పుప్పొడి జీవము, మొలక నిర్ధారణ అంశాలపై వివరించారు. హార్టీకల్చర్ శాస్త్రవేత్త ఎ.కిరీటి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పై అంశాలను వివరించారు. రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ జి.కోటేశ్వరరావు పుప్పొడి సేకరణ, ప్రోసిజింగ్, లేబిలింగ్ యూనిట్‌తో పాటు, హెచ్ మార్కును నమోదు చేయడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.బి.వి. చలపతిరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, బి.నీరజ, వి.అనూష తదితరులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి సాయం



మహేష్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

సఖినేటిపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక మూడు తూములు సెంటర్ చెందిన కుసుమ మహేష్‌కు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. సఖినేటిపల్లి రత్నాలపేటకు చెందిన దాత గొల్ల విజయ ప్రకాష్‌పై సమకూర్చిన ఈ మొత్తాన్ని రోగి తండ్రి కృష్ణకు బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు కేఎస్ఎన్ రాజు, వైస్ ఎంపీపీ-1 రాపాక దీవెనకుమారి, పరిషత్ కోఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్‌రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు రుద్రరాజు రంగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, ఎస్సీ సెల్ ప్రతినిధి చింతా ప్రసాద్, యూత్ ప్రతినిధి నల్లి సుధీర్ పాల్గొన్నారు.

ఇద్దరిపై పిచ్చికుక్క దాడి

అంబాజీపేట: మాచవరంలో బుధవారం ఓ పిచ్చికుక్క ఇద్దరిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. గ్రామానికి చెందిన పి.దుర్గ, కె.మల్లేశ్వరరావు ఇంటి వద్ద ఉండగా ఓ పిచ్చికుక్క ఆకస్మికంగా దాడి చేయడంతో గాయాలపాలయ్యారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు.

మొల్ల జయంతిని అధికారికంగా ప్రకటించడంపై హర్షం

అంబాజీపేట: సాధారణ ప్రజానీకాన్ని సైతం తన రచనలతో చైతన్యపరచిన మహిళా రచయిత్రి మొల్ల జయంతిని రాష్ట్ర ప్రభుత్వ అధికారికంగా ప్రకటించడంపై అంబాజీపేట శ్రీ సీతారామ శాలివాహన సంఘం ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు అందినట్టు సంఘ నాయకులు బుధవారం తెలిపారు. మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శాలివాహనులలో 50 ఏళ్ల వయస్సు వచ్చిన వారికి పింఛను ఇవ్వాలని, చట్టసభలకు వెళ్లేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ర్యాలి శ్రీనివాస వడయార్, ర్యాలి భాస్కర్, ఆదుర్తి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

అంబాజీపేట: గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీకాలను ప్రతి రైతు తప్పనిసరిగా పశువులకు వేయించాలని పశువైద్యాధికారులు డి.రాజేంద్ర, బి.శ్రీనివాస్ అన్నారు. మాచవరం, పసుపల్లి గ్రామాల్లో పశువులకు టీకాలను బుధవారం వేశారు.

పి.గన్నవరం: గ్రామంలో 210 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసినట్టు బెల్లంపూడి సర్పంచ్ బండి మహలక్ష్మి తెలిపారు.

డ్రైన్ల మరమ్మతులు

మలికిపురం: గ్రామంలో పూడుకుపోయిన డ్రైన్ల మరమ్మతు పనులు చేపట్టారు. బుధవారం జరుగుతున్న పనులను సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి పరిశీలించారు. మార్కెట్ నుంచి మసీదు రోడ్డు నిర్మాణంతో పాటు ఇక్కడ అండర్ గ్రౌండ్ డ్రైన్ నిర్మాణ పనులు చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. తాగునీటి సరఫరా మెరుగుతో పాటు, పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు సర్పంచ్ తెలిపారు. కార్యదర్శి బి.శ్రీహరి, నాయకులు గెడ్డం తులసీ భాస్కరరావు, కోళ్ల వేణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా ఐపీ శెట్టి

ఆలమూరు: స్థానిక తహసీల్దార్‌గా ఐపీ శెట్టి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసిన ఆయన పదోన్నతిపై ఆలమూరు మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ ఎం.జానకి రాఘవ, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. జగనన్న భూసర్వే పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు.

పంట కాలువలో వ్యర్థాల తొలగింపు

మలికిపురం: పి.గన్నవరం ప్రధాన పంట కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను బుధవారం తొలగించారు. దిండి నుంచి గుడిమెళ్లంక వరకూ సుమారు నాలుగు కిలోమీటర్లు ఉన్న కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇటీవల పందులకు వైరస్ సోకడంతో చనిపోయిన పందుల కలేబారాలను సైతం కాలువలో పడేయడంతో నీరు కలుషితమైంది. దీనివల్ల దుర్గంధం వెదజల్లుతోంది. ప్రజలు ఇబ్బంది పడుతుండడంతో మండల వ్యవసాయ మండలి చైర్మన్ నల్లి శివకుమార్, జిల్లా సభ్యులు గుబ్బల రమేష్, నల్లి ప్రసాద్ తదితరులు సమస్యలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనలతో ఇరిగేషన్ అధికారులు కాలువలో వ్యర్థాలను, గుర్రు డెక్కను తొలగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సఖినేటిపల్లి: అమలాపురం బైపాస్ రోడ్డులో ప్రమాదానికి గురైన అంతర్వేదిపాలెంకు చెందిన వాతాడి నరసింహస్వామి(26) బుధవారం కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. గత నెల 27వ తేదీన అమలాపురం బైపాస్ రోడ్డులో కాకినాడ నుంచి స్వగ్రామానికి బొమ్మిడి నరసింహ, వాతాడి నరసింహస్వామి బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో బైపాస్ రోడ్డులో చోటు చేసుకున్న ప్రమాదంలో నరసింహ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న రెండో వ్యక్తి నరసింహస్వామి తీవ్రగాయాలు పాలై మెరుగైన చికిత్స కోసం ఆ రోజు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో రెండు రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. నరసింహస్వామికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను వేశారు.